చేస్తావా. ఈ గ్రామ పెద్దలు గ్రూపులు, కక్షలు, కార్పణ్యాల మధ్య నీవుండగలవా. రవళీ లైఫ్ అందులో మేరేజ్ అంటే నాల్గురోజులు మనం సరదాగా తిరగడంకాదు. బరువు బాధ్యతలు! ఈ పల్లెలో వుండిపోయి డాక్టరుగా నీవు షైన్ అవనందుకు, ఎదగనందుకు అసంతృప్తి నిన్ను చుట్టుముట్టి పొరపాటు చేశాననుకోవచ్చు. ఈ మట్టి మనుష్యులకి వైద్యం చెయ్యడానికి చీదరించుకోవచ్చు కొన్నాళ్లపోతే. నీ పిల్లలకి మంచి స్కూళ్లు లేవని వెధవ ఊరు అని తిట్టుకోవచ్చు. నీ అసంతృప్తి నీ వైవాహిక జీవితాన్ని దెబ్బతీసి మనిద్దరికి నరకం సృష్టించవచ్చు. ఇండియాలో పుట్టి పెరిగినవారే పల్లెల్లో వుండక పట్టణాలకి ఎగబడుతున్నారు. రవళీ నేను మట్టిని నమ్ముకున్న రైతుని. రాత్రింబగళ్లు చెమటోడ్చాలి! మట్టి, దుమ్ము ధూళితో పనిచేసే నన్ను చూసి నీ హీరోవర్షిప్ నాల్గురోజుల్లో కరిగిపోవచ్చు. రవళీ నేను ప్రాక్టికల్ మేన్ ని. నన్ను చేసుకునే అమ్మాయి ఈ పరిసరాల్లో అడ్జస్టవగలిగినదయి, శాంత సౌమ్యురాలయి అమ్మని అత్తలా కాక తల్లిలా ఆదరించే మనస్తత్వం.

('ఆంధ్రజ్యోతి' సచిత్రవారపత్రిక)
(1994 దీపావళి ప్రత్యేక సంచిక) ★

# కోడుకు ఖరీదు

అప్పుడే వాన వెలిసినట్లయింది! వాన బయటకాదు....ఇంట్లో! ప్రకాశరావు గారింట్లో! అప్పటికి గంటక్రితం భార్యాభర్త....అరగంట క్రితంనించి అత్తగారు, రెండో కోడలు సునీత మధ్య వాగ్యుద్ధం చెలరేగి చిన్నసైజు తుఫానుగా మారబోతూండగా కూరల సంచులతో స్కూటరు దిగి యింట్లో అడుగుపెట్టారు ప్రకాశరావుగారు. అప్పటికి తాత్కాలికంగా వాన వెలిసినట్టు నిశ్శబ్దం అయింది. మామగారిని చూసి చిన్నకోడలు సునీత వినవిన గదిలోకి వెళ్ళిపోయింది. పెద్ద కోడలు పద్మ తల వంచుకు వంటగదిలోకి నడిచింది. రెండో కొడుకు అజయ్ ఎర్రబడ్డ మొహం తండ్రికి చూపడం యిష్టంలేనట్టు పేపరు మొహానికి అడ్డు పెట్టుకున్నాడు. భార్య కమలమ్మ ఆవేశంగా ఎగిరిపడుతున్న గుండెలతో. ఎర్రబడిన మొహంతో భర్తవంక చురచుర చూసింది. యింట్లో అడుగుపెట్టగానే ఎదురయిన వాతావరణం

మరీ అంత కొత్తదీకాదు, మొదటిసారీ కాకపోవడంతో ఆయన తాపీగా కూరల సంచులు వంటింటి గుమ్మం దగ్గిర దింపి ఏమయిందన్నట్టు భార్యవంక చూసారు. "నా ఖర్మ, నా రాత అన్నట్టు ఆవిడ నుదుటిమీద తపతప కొట్టుకుంది. పద్మ కాఫీ గ్లాసు తెచ్చి మామగారికి యిచ్చింది. "ఏమయిందమ్మా!" అన్నారాయన.

ఏం చెప్పను, ఎలా చెప్పనన్నట్టు నిస్సహాయంగా అత్తగారివంక, మామ గారి వంక చూసి వంటింట్లోకి తప్పుకుంది.

"ఊరికే అన్నారా పెద్దలు....ఎంత అనుభవంతో చెప్తారు. 'సమాన వియ్యం సమాన కయ్యం' అంటారు - పిల్లనిచ్చినప్పుడు ఓ మెట్టు ఎక్కువచూసి ఇమ్మం టారు. తెచ్చుకున్నప్పుడు కాస్త దిగువ మెట్టుమీద పిల్లని తెచ్చుకోమంటారు."

"ఏమిటే గొడవ. ఏం జరిగిందీ సరిగా చెప్పకుండా" విసుక్కున్నారాయన. అజయ్ లేచి గదిలోకి వెళ్ళిపోయాడు. తరువాత చెప్తాను. అంతా చెపుతాను అన్నట్టు భర్తకి సైగ చేసింది కళ్ళతో కమలమ్మ.

ప్రకాశరావుగారిది బ్యాంకి మేనేజరు ఉద్యోగం. గుమాస్తాగా చేరి స్వశక్తితో పైకి వచ్చి కిందటేడే బ్యాంకి మానేజరు అయి మరునటి సంవత్సరం రిటైరవడానికి సిద్ధంగావున్న మధ్యతరగతి సంసారి. ఇద్దరు కొడుకులు ఒక కూతురు. కూతుర్ని అయునింటే యిచ్చారు- పెద్దకొడుకు విజయ్‌కి చదువు సరిగా అబ్బక బి.కాం. ఎలాగో అయిందనిపించాడు. ఎలాగో వీళ్ళని వాళ్ళని పట్టుకుని బ్యాంకులో ఉద్యోగం వేయించారాయన. పద్మ కాస్త లేనింటి పిల్ల అయినా చక్కని చుక్క అని కొడుక్కి చేసుకున్నారు. చేసుకున్నందుకు ఏనాడూ వాళ్ళు విచారించాల్సిన అవ సరం రానీయలేదు పద్మ. రెండోకొడుకు అజయ్ చిన్నప్పటినించి చురుకు, మంచి తెలివితేటలతో ఇంజనీరింగు చదివి, మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ కంపెనీ మేనేజింగ్‌డైరెక్టర్ పార్థసారధిగారు అజయ్ స్మార్ట్‌నెస్. తెలివితేటలు చూసి కూతుర్ని ప్రపోజ్ చేసాడు. సునీతలో అందంకంటె మెరుగులు ఎక్కువ. అణుకువకంటె ఆడిందాటగా పెరిగి మంకుతనం అలవడి. తన మాటే నెగ్గాలన్న అహంకారి-ఇంజనీర్ అయిన అజయ్‌ని యిష్టపడే పెళ్ళాడినా, పెళ్ళాడాక అత్తవారు తమకంటే తక్కువవారని గ్రహించడంతో వాళ్ళపట్ల ఓ చులకనభావం అలవర్చు కుంది. తమ యింట్లో సౌకర్యాలు అత్తవారింట్లో లేవని గునవడంతో మొదలుపెట్టి పెళ్ళయిన మూడు నాలుగు నెలల్లోనే అదను దొరికినప్పుడల్లా దెప్పడం ఆరం భించింది.

ముందు కేవలం భర్త దగ్గిర మొదలుపెట్టి ఆరునెలలు తిరిగేసరికి అత్తగారి ముందు, అందరిముందు చులకనగా మాట్లాడం... యింట్లో పని ముట్టకుండా తనేదో మహారాణి అన్నట్టు తోడికోడలు, లేనింటిది కాబట్టి పనంతా ఆమే చెయ్యా

లన్నట్టు ప్రవర్తించేది. యింటికెవరొచ్చినా తమ పుట్టింటివారి గొప్పలు చెప్పడం, తనకెన్ని రకాల చీరలున్నాయో చూపడం, తను తెచ్చిన మంచాలు, పరుపులు, బీరువా, డ్రస్సింగ్ టేబిల్, టూ ఇన్ వన్, వెండి సామాను, నగలు అన్నీ చూపిస్తూ గర్వంగా అందరినీ చూసేది. ముందు రెండు మూడు నెలలు కమలమ్మ ఏదో చిన్నతనం, పుట్టినింట్లో అపురూపంగా పెరిగింది తనే నెమ్మదిగా మారుతుంది అనుకుంది.

కానీ రోజులు గడిచేకొద్దీ కోడలి అహంభావం, అహంకారం పెరగడం తప్ప తమతో కల్సిమెల్సిపోయే గుణం కనపడకపోవడంతో ఆవిడ నెమ్మదిగానే "పద్మ ఒక్కర్తివుంది వంటింట్లోకివెళ్ళి కాస్త సాయం చెయ్యి" అన్నా సునీత నిర్లక్ష్యంగా "నాకేం రాదు బాబూ పని" అనేది. మామగారికన్నా కాస్త మర్యాద యివ్వకుండా కాళ్లాడిస్తూ పుస్తకం చదువుతూ, పక్కన ఏ చిరుతిండో పెట్టుకు టి. వి. చూస్తూ కూర్చునే కోడలికి ఏం చెప్పాలో ఎలా చెప్పాలో ఆవిడకి తెలియలేదు. పనిపాటు చేయకపోయినా కాస్త సౌమ్యంగా కలివిడిగా, ఆప్యాయంగావుంటే ఎవరూ పట్టించుకునేవారు కారేమో. ప్రతి దానికీ పనివాళ్ళమీద కేకలు, వండిన వంటలు వంక పెట్టడం, అజయ్ ఏ వస్తువన్నా తేవడం మర్చిపోతే అందరి ఎదురుగానే మొగుడి మీద ఎగరడం, అత్తగారికి పొగరుగా జవాబివ్వడం ...యివన్నీ ఎవరికీ నచ్చక పోయినా ఏం చెయ్యాలో తెలియక వూరుకున్నారు. అంతటితో ఆగకుండా యీ మధ్య ఏ మాటొచ్చినా తన వాళ్ళు కట్నం యిచ్చారని, పెళ్ళి ఖర్చు లక్ష అని, సామాను ముప్పైవేలని, నగలు లక్ష అని.... మా వాళ్ళు నాకూ అన్నయ్యలతో పాటు ఆస్తి యిస్తారని గొప్పలు చెప్పడం ఎక్కువైంది.

సునీత యీ ప్రవర్తనకి సగం సహజగుణం కాగా, ఆ గుణానికి ఆజ్యం పోసింది. ఆ యింట్లో పద్మ ఉనికి! పద్మ లేనింటిపిల్ల అయినా చక్కని చుక్క, మంచి రంగు, అందమైన కళ్ళు, నల్లటి జుత్తు చూడగానే ఆకట్టుకునే రూపం! తోడికోడలు తనకంటె అందమైనది అవడం సునీతలో ఈర్ష్య కలిగించింది. ఆ అసూయకితోడు ఆ యింట్లో అందరూ పద్మని అభిమానంగా, గౌరవంగా చూడడం, అందరూ ప్రతి పనికి ఆమెమీద ఆధారపడుతూ, ఆమె ఆ యింట్లో కేంద్రబిందువ వడం సునీతలో అక్కసుని రేపింది. తనింత గొప్ప యింటినించి వచ్చినా, యిన్ని సామాన్లు, యింత కట్నం తెచ్చినా యింట్లో అందరూ ఏమిలేని పద్మని అభిమానించడం సహించలేకపోయింది. దాంతో ఏదో విధంగా పద్మని హేళనచెయ్యడం వ్యంగ్యంగా మాట్లాడడం, ఆమె మొహం చిన్నబోతే ఆనందించే శాడిస్టు మెంటాలిటీ

అలవరచుకుని అమెని చిన్నపుచ్చడానికీ, మాకింతుంది, ఇది తెచ్చాను. యివన్నీ మా వాళ్ళిచ్చినవే, నేనేం చేతులూపుకుంటూ మారు చీరతో రాలేదులాంటి మాటలు పనివాళ్ళ దగ్గిర, యిరుగమ్మతో, పొరుగమ్మతో అంటూ పద్మని చిన్నపుచ్చేది

ఈ పూర్వ కథకి తోడు, వారం రోజులనించి తను వి. సి. ఆర్. కొనాలని భర్తని వేధించడం ఆరంభించింది. అజయ్ డబ్బు లేదన్నాడు. యిప్పుడంత డబ్బుపెట్టి కొనాల్సినంత అవసరం లేదన్నాడు.

"డబ్బెందుకు లేదు, మీ దగ్గిర లేకపోతే మా వాళ్ళిచ్చిన దాంట్లోంచి యివ్వండి."

"మీ వాళ్ళిచ్చిందా....ఎప్పుడిచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమిటా నటన....ఏం తెలీనట్లు మాట్లాడి నన్ను ఫూల్ చెయ్యాలని చూడకండి. ఏం డబ్బేమిటి, మా వాళ్ళిచ్చిన కట్నం ఏభై వేలు...." ఎక్కసంగా అంది.

"ఆ డబ్బు....మేం బ్యాంకిలో దాచుకున్నాం అనుకున్నావా-నా పెళ్ళికి ఖర్చు అయింది."

"నా కట్నం డబ్బు అది....నన్నడగకుండానే ఖర్చు ఎందుకు పెట్టారు."

"అజయ్‌కి అమె నిలేసిన తీరుచూసి చిర్రెత్తింది. "నీ డబ్బేమిటి. మీ నాన్న మాకిచ్చిన డబ్బు అది....మా యిష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టుకుంటాం."

సునీత మొహం ఎర్రబడింది. "అంటే, అంటే....ఆ డబ్బంతా వాడేశారా... అసలు మా నాన్నగారు నా పేరనే బ్యాంకిలో వేద్దాం అనుకున్నారు....బాగుండదని వూరుకున్నారు....అది ఖర్చు పెట్టడానికి మీ వాళ్ళకి అధికారం ఎవరిచ్చారు...." అంటూ ఎగిరిపడింది.

"కట్నం యిచ్చి నన్ను కొనుక్కున్నాననుకోకు....వూరుకుంటుంటే మరీ ఎక్కువవుతోంది నీ వ్యవహారం. మీ నాన్న యిచ్చింది కట్నం కాదు లంచం! నీలాంటి భార్యని జీవితాంతం భరించడానికి యిచ్చిన స్వల్ప మొత్తం లంచం ఇచ్చి నిన్ను నాకంటకట్టాడు" - భార్య ప్రవర్తనకి విసిగిపోయివున్న అజయ్ అవకాశం చూసి దెబ్బకొట్టాడు.

"ఏమిటీ, ఏం అన్నారు....? నన్ను అంటకట్టారా....దానికి లంచం యిచ్చారంటారా...." భద్రకాళిలా ఎగిరిపడింది. అమె అహం దెబ్బతినడంతో ఏం అంటుందీ తెలియనంతగా ఆవేశపడి నానా మాటలూ అనడం మొదలుపెట్టింది - అజయ్ విసురుగా చెప్పులు వేసుకుని "ఛీ....ఛీ....పై మెరుగులకి మోనపోయి పెళ్లాడాను.....ఆదివారం అన్నా కొంపలో శాంతిగా వుండనీయవు" అంటూ విసవిస

గదిలోంచి బయటికి వచ్చేశాడు. ముందు గదిలో కమలమ్మ అంతా వింటూనే వుంది-
"ఏమిటిరా....ఏమిటా గొడవ...." కొడుకు వంక సానుభూతిగా చూస్తూ అంది.
"ఏముందమ్మా ఆవిడ కట్నం యిచ్చి నన్ను కొందిట. ఆ డబ్బు తనదిట, మనకి ఖర్చుపెట్టే హక్కు లేదట."

"బాగుంది గొడవ, కట్నం యిస్తే మనం దాచుకున్నామా, పెళ్లి కేగా ఖర్చు పెట్టాం. అయినా ఎన్నిసార్లు అంటుందా మాట."

"లక్షసార్లు అంటాను....కట్నం తెచ్చాను గనుక అంటాను. పుచ్చుకోలేంది అంత పౌరుషం ఎందుకు" లోపల్నించి విసురుగా వచ్చి కసిగా అంది సునీత.

"అనమ్మా లక్షసార్లు అను - బుద్ధిగడ్డితిని మీ సంబంధం చేసుకున్నందుకు అంతకంటె బుద్ధితక్కువయి మీరిచ్చిన డబ్బు తీసుకున్నందుకు బాగా అను." తరువాత ఓ పావుగంట అత్త, కోడలు మాటలు విసురుకున్నారు. అజయ్ పద్మ ప్రేక్షకులయి వుండిపోయారు. సునీత మొగుడి మీద కోపం, డబ్బివ్వలేదన్న కక్ష అన్నీ కలిసి అత్తగారనైనా చూడకుండా దులిపి పారేసింది. ప్రకాశరావుగారు అప్పుడు రాకపోతే యింకా చిలికి చిలికి గాలివాన ఎంతదూరం వెళ్లేదోగాని, ఆయన రాకతో అప్పటికి ప్రశాంతత చోటు చేసుకుంది.

* * *

"చూడండి మీరేం చేస్తారో....ఎలా తెస్తారోగాని ఆ ఏభై వేలు తెచ్చి దాని మొహాన కొడ్తారా లేదా...."రాత్రి గదిలోకి వస్తూనే మొదలుపెట్టింది కమలమ్మ.

"ఏ ఏభై వేలు?" ఆశ్చర్యంగా చూశారు ప్రకాశరావుగారు...."ఎవరికివ్వాలి."

"ఏమిటండీ, రామాయణం అంతా విని ఏం తెలీనట్టు అడుగుతారు....మీ చిన్న కోడలు సునీత....కట్నంగా తెచ్చిన ఏభై వేలు మొహాన కొట్టమంటున్నాను. ఆవిడ మాటలు విని యింక భరించే శక్తి నాకులేదు. "ఇంకా రోజూరోజూ ఆవిడ చేత మాటలు పడే ఓపిక నాకు లేదు." ఆవిడ గుండెలు ఆవేశంగా ఎగిరిపడ్డాయి.

"ఏమయింది" ప్రశాంతంగానే అడిగారు.

"ఏమవడం ఏమిటి-ఆవిడ తెచ్చిన డబ్బుట-అది ఖర్చు చేసే హక్కు మనకి లేదుట. వాడిని, మనల్ని అనరాని మాటలు అందివాళ. ఇన్నాళ్లూ ఆవిడ గొప్ప, పుట్టింటి గొప్పలతో సరిపెట్టింది. యివాళ పెద్దదాన్ననైనా చూడకుండా ఎన్నిమాటలందో....మొగుడ్ని దులిపి పారేసింది."

"ఇవాళ ప్రత్యేకం....యీ డబ్బు గొడవెందుకు వచ్చింది."

"ఆవిడగారు వి.సి.ఆర్. కొనాలట. అజయ్ డబ్బు లేదంటే - కట్నం డబ్బులో యిమ్మని మొదలు పెట్టింది."

"చెప్పకపోయావా, ఆ డబ్బు మనం దాచుకోలేదని- పెళ్లికి ఖర్చు చేశామని."

"ఆ మాత్రం అర్థం చేసుకునే పిల్ల అయితే యిన్ని మాటలెందుకు-చూడండి యీ కొంపలో నేను కాస్త శాంతిగా బతకాలంటే ఆవిడ డబ్బు ఆవిడ మొహాన పారేసి మన పరువు నిలపండి ....లేదంటే ఆవిడో నేనో యీ కొంపలో వుండే ఏర్పాటు చెయ్యండి...." విసురుగా అంది కమలమ్మ – కోడలు చేసిన అవమానం ఈ రోజు ఆవిడ సహనాన్ని హద్దులు దాటించింది.

"ఏదో ఏభై రూపాయలన్నంత సులువుగా అంటున్నావు....అంత డబ్బు ఎక్కడినించి వస్తుంది."

ఇంతలో....తలుపుమీద వేలితో కొట్టి - తలుపు తోసుకుని అజయ్ లోపలి కొచ్చాడు. "నాన్నగారూ-అమ్మ చెప్పింది నిజమే....మన పరువు దక్కాలంటే, మన మర్యాద నిలబడాలంటే ఆ ఏభై వేలు దాని మొహం మీద పారేయ్యాలి. మరీ గడ్డిపోచలా తీసిపారేస్తోంది మనల్ని....నేను ఆఫీసులో పాతిక వేలకి లోను పెట్టాను....మీరు సగం ఎలాగన్నా సర్దండి నాన్నా...." చాలా నొచ్చుకుంటూ అన్నాడు.

కొడుకు మొహంలో బాధ, అవమానం చూసి ఈ వ్యవహారం చాలా దూరమే వెళ్లిందని గుర్తించారు ఆయన. కొడుకు పరిస్థితి ఆయనకర్థం అయింది. ఇటు తల్లి దండ్రులు, అటు అహంకారి భార్య మధ్య నలుగుతున్న కొడుకుని సానుభూతిగా చూశారు. ఆయన ఒక్క నిమిషం మౌనంగా వూరుకుని "ఆలోచిద్దాం....డోంట్ వర్రీ అజయ్....నేను చూస్తాలే యీ విషయం....నువ్వెళ్లు మనసు పాడుచేసుకోకు అనవసరంగా....వెళ్లి పడుకో-"కొడుకు భుజం తట్టారు ఓదార్పుగా....కొడుకు వెళ్లాక కమలమ్మ...."వాడితో నన్నా సరిగా వుంటే నేనింత బాధపడకపోదును....యీ రోజు ఎన్నిమాటలంది వాడిని....వాడి మొహం చూడండి...." ప్రకాశరావుగారు ఆలోచనలో పడ్డారు. "చూద్దాం....రేపు నేను మాట్లాడుతాను ఆ అమ్మాయితో.... వాళ్ల నాన్నగారితో కూడా మాట్లాడతాను....పడుకో....పడుకో....వూరికే ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు...." తలగడ మీదకి వాలి అన్నారాయన.

* * *

రెండు రోజుల తరువాత ...

రాత్రి, భోజనాలయ్యాక ఎవరి గదులలోకి వాళ్లు వెళ్లబోతూంటే అందరినీ ఉద్దేశించి ప్రకాశరావుగారు...."మీరంతా ఒక్కసారి ఇలా కూర్చోండి. అజయ్, ఒక పెన్ను, కాగితం పట్టా....సునీతా నువ్వు యిలారా, నీతో మాట్లాడాలి....మనం కొన్ని లెక్కలు తేల్చుకుందాం యివాళ అన్నారు" గంభీరంగా ప్రకాశరావుగారు.

సునీత మొహం గంటుపెట్టుకుని వచ్చి, ఓ కుర్చీలో కూర్చుంది. అజయ్ అర్థం కానట్టు చూశాడు. అయినా పెళ్లి తండ్రి చెప్పినట్టు కాగితం పెన్ను పట్టుకువచ్చాడు. పెద్దకొడుకు విజయ్ జరుగుతున్నది తనకి సంబంధించినది కాదన్నట్టు ఓ పుస్తకం తిరగేస్తూ కూర్చున్నాడు. కమలమ్మకి భర్త ఏం మాట్లాడబోయేది తెలియకపోయినా యివాళ ఆయన కాడోపేడో తేలుస్తారు అని అర్థం చేసుకుంది.

"చూడమ్మా సునీతా ముందుగా మీవాళ్లిచ్చిన ఏభై వేలు కట్నం గురించి మనం తేల్చుకుందాం. ఎందుకంటె నీవు యీ యింట్లో మాటి మాటికి నేనింత తెచ్చాను అది నా డబ్బు అన్నట్టు మాట్లాడుతున్నావట. ఈ విషయం మా అందరి పరువుకు సంబంధించినది కనక...." ఆయన మాట పూర్తి కాకముందే సునీత "ఇచ్చారు కనుక అన్నాను, ఉన్నమాట అంటే...."

"ప్లీజ్, మధ్యలో మాట్లాడకు అంతా విన్నాక నీ అభిప్రాయం అడిగినపుడు మాట్లాడుదువుగాని .." కోడలివంక తీవ్రంగా చూస్తూ అన్నారు ప్రకాశరావుగారు.

"మీ వాళ్ల ఏభై వేలిచ్చిన మాట నిజం. కట్నం అంటే మగపెళ్లి వారికిచ్చే డబ్బు, అది ఎలా ఖర్చుపెట్టినా అది మా యిష్టం. ఇంతకీ యింత కావాలని, యివ్వాలని మేం అడగలేదు. మీనాన్నగారు ఆయన తాహతుని బట్టి యిస్తే పుచ్చుకున్నాం. ఆ పుచ్చుకున్న డబ్బు పెళ్లి ఖర్చుకి వాడాం గాని బ్యాంకులో దాచుకోలేదు. అజయ్ కాగితం మీద లెక్కవేయి. నీ నగలు పదమూడు వేలు, నీ చీరలు ఆరువేలు, మీ వాళ్ల బట్టలు రెండువేలు, అజయ్ బట్టలు నాలుగువేలు, మాకింద మేం ఖర్చు పెట్టుకున్నది కేవలం యింటిల్లిపాదికి బట్టలు మూడువేలు మాత్రం - ఆ తరువాత బాజా బజంత్రీలూ, గృహప్రవేశం, మా బంధువులకిచ్చిన బట్టలు అన్నీ కలిపి నాకు అరవై వేలయింది. అంటే మీరిచ్చింది కాక పదివేలు నాచేతిది పడింది...."

"మీ కొడుకు పెళ్లిఖర్చు మీరు పెట్టుకోవాల్సింది మా డబ్బులో వాడతారా" వ్యంగ్యంగా అంది. ఆమె మాట్లాడిన తీరుకి అందరికీ కోపం ముంచుకు వచ్చింది. ప్రకాశరావుగారు తమాయించుకున్నారు. "అవును, ఆ డబ్బు నిన్ను మావాడు పెళ్లి చేసుకోడానికి మీ నాన్నగారు యిచ్చారు మాకు—నీ మాటల్లో చెప్పాలంటే ఆ ఏభై వేలిచ్చి మావాడ్ని కొనుక్కున్నావు అవునా, మరి ఓసారి డబ్బిచ్చి వస్తువు కొన్నాక ఆ డబ్బు నీదెలా అవుతుంది. అంచేత మా డబ్బు మేం ఎలా ఖర్చుపెట్టినా అడిగే హక్కు నీకు లేదు. ఈ పాయింట్ క్లియర్ అయిందనుకుంటాను...." గంభీరంగా అన్నారు. సునీత మొహం నల్లబడింది....కాని మామగారి నోటినించి తన భర్తని కొనుక్కున్నానన్నమాట వినడం సంతోషాన్నిచ్చింది.

"ఇదిగో సునీతా, నువ్వు కట్నం యిచ్చావనని, మా అబ్బాయిని కొనుక్కున్నావని అందరి దగ్గిర అనడం మేం సహించలేకపోతున్నాం - ఇది మా అందరికీ అవమానంగా వుంది. అంచేత నీవు యిచ్చిన డబ్బు నీకు వాపసు యివ్వాలని నిర్ణయించుకున్నాం, ఇదిగో ఏభై వేలకి చెక్కు .... అంటే దీనర్థం నీకింక మేము బాకీలేము సరికదా నీకే మేము నగలు, చీరలు, మీవాళ్ళకి బట్టలు అన్నీ పెట్టాం అని గుర్తుంచుకో. నీ లెక్క తేలి పోయింది కనక, మా వాడిని మేం నీకు అమ్మలేదు కనక ఈ రోజునించి మా అబ్బాయి సంపాదన మాది, వాడి డబ్బు మేం ఇష్టంవచ్చినట్టు ఖర్చుపెట్టుకుంటాం నిన్ను చేసుకున్నాడు కనక నీంతిండి బట్టపోషణభారం వాడిది. వాడి సంపాదన, ఖర్చు విషయం ఈ రోజు నిచి మేం చూసుకుంటాం. నీకేదన్నా దేనికన్నా కావాలంటే మీ అత్తగారికి చెప్పి ఆవిడ దగ్గిర తీసుకోవాలి...."

సునీత మొహం వెలవెలబోయింది. మామగారి మాటలకర్థం బోధపడగానే మొహం ఎర్రబడింది ... "నేనాయన భార్యని- మీ యింటిలో పని మనిషిని కాదు. నాకాయన మీద, ఆయన సంపాదన మీద సర్వాధికారాలున్నాయి....భార్య అంటే పెళ్ళంటే పాపం మీకు అర్థం తెలియదు కాబోలు."

"భార్య అంటే మాకు తెల్సిన అర్థం యింటికి యిల్లాలు. అతని బిడ్డ తల్లి, భర్త కష్ట సుఖాలలో పాలుపంచుకునే యిల్లాలని మాకు తెలుసు. నీకు తెల్సిన అర్థ భర్త అంటే డబ్బిచ్చి కొనుక్కున్నానని, నీ కను సన్నలలో మెలగాలని, భర్త అంటే డబ్బు సంపాదించే మనిషిగా మాత్రం నీకు తెలుసు....చూడమ్మా యిన్ని మాటలనవసరం. మా అబ్బాయిని మేం పాతికేళ్ళు పెంచుకున్నాం-బోలెడు ఖర్చు పెట్టి చదివించుకున్నాం. అంచేత వాడి సంపాదన మాదే....అది మేం ఎందుకు వదులుకుని నీకు వూరికే వాడిని అప్పచెప్పాలి...."

"అంటే కన్న కొడుక్కి తిండిపెట్టుకోడం, చదివించుకోడం ఊరికి ఉపకారం అనుకుంటున్నారా. కన్నందుకు మీ బాధ్యత అది-" హేళనగా అంది. ఆయన అదోలా చిద్విలాసంగా నవ్వారు. "అందరి సంగతి నాకవసరంలేదు. నేను కొడుకు మీద చాలా ఖర్చు పెట్టాను. చిన్నప్పటినించి వాడి తిండి, బట్ట, చదువు అన్నీ వదిలేసినా కేవలం వాడివి యింజనీరింగు చదివించడానికే నలభై ఐదువేలయింది. యింతకష్టపడి చదివించి, వాడు మూడు వేలు సంపాదిస్తూండగా వాడిని యిప్పుడు నీకెందుకు అప్పచెప్పాలి?" ప్రశ్నార్థకంగా చూశారు. సునీతకి వెంటనే జవాబు తట్ట లేదు. జవాబు తట్టగానే విసురుగా, వ్యంగ్యంగా "అలాంటప్పుడు కొడుక్కి పెళ్ళి చెయ్యకుండా మీ దగ్గిరే వుంచుకోవాల్సింది అప్పుడు కొడుకు మీద పెట్టిన ఖర్చు రాబట్టుకునేవారు గదా" అంది.

"కరక్ట్. బాగా చెప్పావు. మేం వాడి మీద అంత ఖర్చు పెట్టికూడా వాడి సంపాదనకి ఆశపడకుండా నీకెందుకు అప్పచెప్పాం అంటావు? నీవిచ్చిన ఏభై వేలకి ఆశపడి అంటావు-అవునా, చూడమ్మా కోడలా మా వాడికిప్పుడు మొదట్లోనే మూడు వేలు జీతం. అంటే ఏడాదికి ముప్పై ఆరువేలు. ఇంకొన్నాళ్ళల్లో ఐదు వేలు, తరువాత ఎనిమిది, రిటైరయ్యేనాటికి పదివేలుండవచ్చు. వాడింకో ముప్పై ఏళ్ళు ఉద్యోగం చేస్తే అధమం నెలకి మూడు వేలు చూసుకున్నా పదిలక్షలపైన సంపాదిస్తాడు. నీవిచ్చే ఏభై వేలకి ఆశపడి లక్షలు సంపాదించే కొడుకుని నీకెందుకు అప్పచెప్పాం. ఎవరికన్నా పొలమో, తోటో వుంటే ఆ ఫలం వారనుభవిస్తారుగానీ వూర్లో వాళ్ళకివ్వరు. ఆ పొలం, తోట సాగు చెయ్యలేకపోతే కౌలుకిస్తారు. అమ్ముకుని డబ్బు సంపాదించుకుంటారు. అలాంటి లక్షలు విలువ చేసే కొడుకుని ముష్టి ఏభై వేలకి నీకెందుకమ్మాలనుకున్నాం...." సునీత తలవంచింది.

"దానికి నీవిప్పుడు జవాబివ్వలేవు. నీకు పిల్లలు పుట్టి పెరిగాక అర్థం అవుతుంది. తల్లితండ్రులు పిల్లల్ని నిస్వార్థంగా అష్టకష్టాలు పడి పెంచుతారు. చదివిస్తారు. ఉద్యోగాలిప్పిస్తారు. పెళ్ళిళ్ళు చేసి తమ బాధ్యతలు తీర్చుకుంటారు. కొడుక్కి పెళ్ళి చేసి వంశం నిలుపుకోవాలనుకుంటారు. కానీ, కొడుకుని ఏ ఇంజనీరో, డాక్టరో చేస్తే ఏభై యో, లక్షో కట్నం వస్తుందని ఏ తల్లితండ్రులూ పిల్లల్ని చదివించరు. అలా అయితే....మీ దగ్గర కట్నం ఎందుకు తీసుకున్నామన్న సందేహం వస్తుంది నీకు....చూడు నీవు చిన్నపిల్లవి నీకు తెలియని విషయాలు చాలావున్నాయి. మనిషి ఈ సమాజంలో బతకాలంటే కొన్ని నియమాలు, ఆచారాలు, సాంప్రదాయాలు పాటించాలి. అందులో మధ్య తరగతి మానవులు ఈ ఆచారవ్యవహారాల చిక్కుముళ్ళ మధ్య బందీలు! అటు లక్షాధికార్లకి డబ్బు సమస్య లేదు కనక డబ్బు విరజిమ్మగలరు. ఇటు అట్టడుగువారు ఓలియిచ్చి పిల్లను తెచ్చుకునేవారికి ఈ కట్నాల సమస్యలేదు. ఎటొచ్చి ఈ మధ్య తరగతి సంసారే అన్ని సాంప్రదాయాలకీ కట్టుబడి వుండాలి....కొడుకయినా. కూతురయినా పెళ్ళిళ్ళప్పుడే కొన్ని ఇచ్చిపుచ్చుకోడాలు తప్పవు. సాంప్రదాయరీతిలో పెళ్ళిళ్ళు జరిగినపుడు ఇంటికి ముత్తయిదువ వస్తే ఓ చీరో, కనీసం రవిక, పసుపు కుంకం పెట్టడం మన ఆచారం. అలాంటప్పుడు కొడుకు పెళ్ళి జరుగుతుంటే అత్త ఆడబిడ్డలకి చీరలు పెట్టడంలో వింత ఏముంది ఆ ఒక చీరతో, వాళ్ళిచ్చే లాంఛనాలతో వీళ్ళ రోజులు వెళ్ళిపోవు. అది వేడుక, ఆచారం తప్ప ఆడ పెళ్ళి వారిని పీడించడం కాదు. కోడలికి నగలేం పెట్టారు అన్న యిరుగుపొరుగు బంధువులు అడిగే మొదటి ప్రశ్ననించి ఓ సామాన్య గృహస్థు తప్పించుకోలేదు. ఏదో తాహతుకొద్దీ పెట్టాలనుకుంటారు

ఇదిగో యిక్కడ మధ్య తరగతి గృహస్థు తప్పటడుగు వేస్తాడు. నలుగురిలో పరువు కాపాడుకోడానికి. నలుగురి మధ్య చిన్నతనం పొందకుండా వుండడం కోసం కొడుకు పెళ్లి చెయ్యాలంటే తప్పనిసరి ఖర్చుల కోసం ఆడపెళ్లివారిచ్చే డబ్బులకి ఆశపడ తాడు-అటు కూతురికీ చేసి, యిటు కొడుక్కి చెయ్యాలంటే శక్తికి మించిన పని అయిన సామాన్య గృహస్థు ఆడపిల్లవారిచ్చేది, తనది కలిపి ఖర్చుపెట్టి గట్టెక్కా లన్న ప్రలోభంలో పడతాడు. సాంప్రదాయరీతుల్లో జరిగే పెళ్లిలో ఏ ఖర్చూ తప్పని పరిస్థితిలో అంటే తనే ఖర్చు పెట్టలేక కట్నంకి ఆశపడి తలవంచుతారు. అంటే నేనీ కట్నాలని ఆమోదిస్తున్నానని కాను. ఓ సామాన్య గృహస్థు అశక్తత అవన రానికి తలవంచుతుంది. ఎక్కడో నూటికి ఒకరు డబ్బుకోసం పీడించవచ్చు. ఇచ్చిన కట్నాలు దాచుకునే పిసినారి వుండవచ్చు. నూటికి తొంబయితొమ్మిది మంది పెళ్లి ఖర్చులకే వినియోగిస్తారు తప్ప బ్యాంకిలో దాచుకోవాలని ఎవరూ తీసుకోరు. నాపాయింటు అర్థమైందనుకుంటాను." సునీత మాట్లాడలేక చూపులు దించుకుంది.

"ఆడపిల్లని కన్నవారు ఏ ఖర్చు పెట్టకూడదను కుంటే, యిటు అత్తవారిచ్చే నగలకీ ఆశపడకండి-ఏ ఆచారాలు, యిచ్చిపుచ్చుకోడాలు లేకుండా మీ యువతరం పెళ్ళి రిజిష్టరు మేరేజి చేసుకునిరండి. అంతేగాని సరదాలు, సంప్రదాయాలు పాటిం చాలి. అందరూ రావాలి, ఖర్చు మాత్రం అవకూడదు అనే పద్ధతికి స్వస్తి చెప్పి ధైర్యంగా రిజిష్టరు పెళ్లి చేసుకోండి-తరువాత కూతురికి తల్లితండ్రులిచ్చుకునే కానుకలు, సారెలు కూతురే అనుభవిస్తుంది. నీవు తెచ్చుకున్న సామాను నీ గదిలో పెట్టుకున్నావు మేం వాటిని వేలితో కూడా తాకలేదు....ఆ సామాను ఎవరి తాహతు లని జట్టి వారిస్తారు."

తండ్రి మొదలుపెట్టి ఎలా నరుక్కువస్తున్నదీ, భార్య మొహంలో మారే రంగులు చూసి సంతోషించాడు అజయ్. బాగా చెప్పారు అన్నట్టు కమలమ్మ మెచ్చు కోలుగా చూసింది. సునీత తల యింకొంచెం కిందకి వాలింది.

"సునీతా ఇంకో విషయం నీవేదో చాలా గొప్పింటినించి వచ్చానని కట్న కానుకలు తెచ్చానని పదే పదే అందరితో చెప్తూ పద్మవి కావాలని చిన్నపుచ్చు తున్నట్టు విన్నాను. ఆ అమ్మాయి నీలా కలవారింటపుట్టలేదు. ఆమె అందమే మావాడికి కట్నం! ఆమె అణకువ, సౌమ్యత మాకు లాంఛనాలుగా యిచ్చింది. ఆమె మాకు పంచి యిచ్చిన అభిమానం, గౌరవమే మాకు సారెగా తెచ్చింది. ఏ అత్త వారైనా కోడలినించి కోరుకునేవి యివే-" "సునీత మొహం నల్లబడిపోయింది.

"సునీతా నీవు మా యింట్లో వున్నావుగాని నీ యింట్లోమేములేం. ఇంట్లో వున్నందుకు మాకేదో వెయ్యి రూపాయలిచ్చి, మిగతాదంతా నీసరదాలకే ఖర్చు

పెట్టుకుంటున్నావు. మా ఇంట్లోవుంటూ మమ్మల్ని చిన్నచూపు చూసే నీ అహంకారాన్ని సహించం యిక! అందరం కల్సివున్నామన్న ఆనందం, సంతృప్తి లేకుండా నీ ప్రవర్తనతో మాకు మనస్తాపం కల్గిస్తున్నావు-ఈ యింట్లో మేం వున్నన్ని రోజులూ సర్వాధికారాలూమావి. అలా మా అధికారానికి తలవగ్గి కోడలిగా అణకువగా వుండలేకపోతే మీరు వేరింటి కాపురం పెట్టుకోండి-ఇది నీ యిల్లని, వీళ్ళు నీవాళ్ళని, వారి గౌరవమర్యాదలు కాపాడడం నీవిధి అని తెలుసు కున్ననాడు మనం మళ్ళీ కలుద్దాం. నీ పుట్టిల్లు ఎంత గొప్పదైనా నీకు ఖర్తింటి పేరే వస్తుంది కాని, నీ పుట్టింటి పేరు నీవెంట రాదన్నది నీవు గుర్తించిననాడు నీకీ యింట్లో స్థానం వుంటుంది. లక్షలు సంపాదించే కొడుకుని నిస్వార్థంగా నీ దగ్గిరనయాపైసా తీసుకోకుండానే నీకప్పగిస్తున్నాను. అన్నది గుర్తించుకో. రేపటినుంచి మీదారి మీది-" ఆయన చెప్పదలచింది యింకేమి లేనట్టు కుర్చీలో వెనక్కి వాలారు. సునీత దెబ్బ తిన్న పులిలా తలెత్తింది. "....ఫోఫో అంటే యింకా ఈ కొంప పట్టుకువాలే ఖర్మ నాకేం లేదు. ఈ విధంగా నైనా హాయిగా వేరింటి కాపురం పెట్టుకునే ఛాన్సు యిచ్చి నందుకు థాంక్స్"-సునీత పొగరుగా అని విసవిస గదిలోకి వెళ్ళిపోయింది.

అజయ్ తండ్రి వంక చూశాడు సందేహంగా-"నాన్నగారూ....నిజంగానే.... సీరియస్‌గానే అన్నారా" అతని కళ్ళల్లో బేలతనం. కొడుకు భుజం తట్టారు. ఆయన "అజయ్‌యింతచెప్పినా ఆ అమ్మాయిలో ఏ మాత్రంపశ్చాత్తాపం కనపడ్డా. యీ మాట అనక పోయేవాడిని ఆ అమ్మాయి అహంకారం వీసమెత్తు తగ్గలేదు చూశావా.... నీవు- కొన్నాళ్ళు వేరింటి కాపురం పెట్టి ఆ అమ్మాయి పుట్టింటివారిచ్చేది తీసుకో కుండా మీకు వచ్చిన దానితోనే కొత్తకాపురం ఆరంభించు. డబ్బు యిబ్బందులు, యింట్లో పనిపాటలు అన్నీ చేసుకుంటేగాని ఆ అమ్మాయి దారికి రాదని నా ఉద్దేశం. కట్నం డబ్బు వాపసు యిచ్చాం కనక ఆ అమ్మాయి మనల్ని ఏ విధంగానూ బ్లేమ్ చెయ్యలేదు. అజయ్ లెటజ్ హూప్ ఫర్ దిబెస్ట్....నీవెనక మేం ఎప్పుడూ వుంటాం. బాధపడకు....ఆ అమ్మాయిని సంస్కరించడానికి నాకింతకంటె మార్గం కనపడలేదు. ఆయన కొడుకు బుజం తట్టారు ఓదార్పుగా.

గమనిక : ఇది కట్నాలని సమర్థించడం కాదని-కట్నం తెచ్చామని అహంకారం చూపే కోడళ్ళని, మధ్య తరగతి సంసారి అసహాయతని మరో కోణం నించి ఎత్తిచూపడమని పాఠకులు అర్థం చేసుకుంటారని ఆశ.

—రచయిత్రి

(వనిత)

★